క్లుప్తంగా

తాగునీటి నాణ్యత పరిశీలన



నీటి నాణ్యతను పరీక్షిస్తున్న మున్సిపల్ డీఈఈ కనకరాజు, తదితరులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని దేవాంగుల వీధి, చిన్నబజారు, వరాహగిరి వీధుల్లో తాగు నీటి కుళాయిల ద్వారా వచ్చే నీటి నాణ్యతను మున్సిపల్ డీఈఈ కనకరాజు మంగళవారం పరీక్షించి, పరిశీలించారు. పట్టణవాసులకు పరిశుభ్రమైన తాగునీరు అందివ్వడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని, దీనిపై మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్‌లకు నివేదిక అందజేస్తామన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

వంగర: మండలంలోని శివ్వాం గ్రామంలో కొత్తగా రూ.2.50 లక్షల వ్యయంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇదివరకు గ్రామం మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో నన్న భయాందోళనలో గ్రామస్తులంతా ఉండేవారు. ఇదే విషయాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దృష్టికి స్థానిక నేతలు తీసుకువెళ్లగా, పాత ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి, జనావాసానికి దూరంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన ఎరువులనే విక్రయించాలి



ఎరువుల రికార్డులు పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: నాణ్యమైన ఎరువులనే రైతులకు విక్రయించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న వేంకటేశ్వర ఎరువుల దుకాణంలో ఎరువుల నిల్వలు, విక్రయాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేర వ్యాపారాలు చేయాలని, రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల స్టాక్, విక్రయాలకు సంబంధించి, రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు.

శరవేగంగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణం



బొద్దాంలో కొత్తగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనం

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో కొత్తగా మూడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. శిశు సంక్షేమ శాఖ నుంచి మంజూరైన రూ.12 లక్షల నిధులతో ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. వీలైనంత త్వరగా భవన నిర్మాణాలు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని సర్పంచ్ నక్క తవిటమ్మ, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి తెలిపారు.

మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలసుబ్రహ్మణ్యం

వంగర: అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎం.వి.బాలసుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని ఎం.సీతారాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అక్కడి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు ఉన్నవీ లేనివీ పరిశీలించారు. అలాగే అక్కడి ర్యాంప్ నిర్మాణాన్ని పరిశీలించి, దివ్యాంగ ఓటర్ల కోసం తప్పనిసరిగా ర్యాంప్ నిర్మాణం ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రాంబాబు, పంచాయతీ కార్యదర్శి వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాడు నిర్లక్ష్యం.. నేడు ప్రగతి పథం!

- ప్రగతి పట్టాలెక్కిన రామభద్రపురం రెల్లివీధి
- ఏళ్లతరబడి వేధిస్తున్న సమస్యలకు ప్రభుత్వం చెక్
- రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, మినీ వాటర్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు



రెల్లివీధిలో నిర్మించిన సీసీ రోడ్డు





వాటర్‌ట్యాంక్ వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న రెల్లివీధి వాసులు

రామభద్రపురం: కొన్ని దశాబ్దాలుగా ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది ప్రజాప్రతినిధులు మారినా మండల కేంద్రంలోని రెల్లివీధిలో నెలకొన్న రోడ్డు, తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం ఆ వీధికి వచ్చే నాయకులు ప్రతిసారీ రోడ్డు, తాగునీటి సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారే తప్ప నెరవేర్చిన దాఖలాలు లేవు. ఏ చిన్నపాటి వర్షం కురిసినా బురదమయమైన అక్కడి రోడ్డు మీదుగానే కాలనీవాసులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. ఇకపోతే తాగునీటి కోసం మినరల్ వాటర్ కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి. ఇవే బాధలను పలుమార్లు పాలకుల వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజాసమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రతీ గ్రామానికి మౌలిక సదుపాయాలు ఉండేలా చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినలప్పలనాయుడు ఆ కాలనీలో పర్యటించినప్పుడు వారు పడుతున్న బాధలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సైతం వారి సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయడంతో స్పందించిన ఎమ్మెల్యే ఆ కాలనీవాసుల సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కొన్ని నిధులు, ఎంపీపీ నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేయించి, సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు మినీవాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయించి, ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ఇదంతా కేవలం రెండు నెలల వ్యవధిలోనే జరగడంతో ఆ వీధి ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ సర్కారు పనితీరును హర్షిస్తున్నారు. తమ సమస్యలు తీర్చిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు, ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.



ఇంటింటికీ ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి వద్ద నీరు పడుతున్న మహిళ

గతంలో మురుగునీరే గతి..



కొన్ని దశాబ్దాలుగా మా కాలనీలో తాగునీటి సమస్య ఉండేది. ప్రభుత్వాలు మారుతున్నా మా సమస్యను మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. ప్రతిరోజూ మురుగునీరు తాగే పరిస్థితి ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా సమస్యలు తీరాయి. ముఖ్యంగా తాగునీటి సమస్య తీరడంతో చాలా ఆనందంగా ఉంది.

– సొండి దయామణి, రెల్లివీధి, రామభద్రపురం.

ఓటేసి రుణం తీర్చుకుంటాం..



ఇన్నాళ్లు వీధిలో సీసీ రోడ్డు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. చిన్నపాటి వర్షం పడినా రోడ్డంతా బురదమయమయ్యేది. దానిపై నడవడానికి చాలా కష్టంగా ఉండేది. ఒక్కోసారి జారిపడిపోయి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి. తమ సమస్యను కేవలం జగనన్న ప్రభుత్వం మాత్రమే పరిష్కరించింది. రానున్న ఎన్నికల్లో తామంతా వైఎస్సార్ సీపీకి ఓటు వేసి, రుణం తీర్చుకుంటాం.

– సొండి లక్ష్మి,రెల్లి వీధి, రామభద్రపురం.

జగనన్న మేలు మరువలేం..



సీఎం జగనన్న పుణ్యమా అని మా కాలనీకి రోడ్డు, తాగునీరు వచ్చాయి. తమలాగే ఎంతోమంది సమస్యలను ఆయన తీర్చారు. ఆయన చేసిన మేలు మరువలేం. మహిళలకు కూడా ఎన్నో సంక్షేమ పథకాలు అందించి, ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. అటువంటి వ్యక్తి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– కుప్పిలి స్వాతి, రెల్లివీధి, రామభద్రపురం.

పక్కాగా పౌష్టికాహారం పంపిణీ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పక్కాగా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూకాలమ్మ సూచించారు. మండలంలోని వండానపేట, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, వన్నలి, కె.ఎం.వలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం పరిశీలించారు. కేంద్రాలకు వస్తున్న చిన్నారుల హాజరు, పౌష్టికాహారం నిల్వల రికార్డులు చూసి, ప్రీస్కూల్ నిర్వహణ, పౌష్టికాహారం సరఫరా వంటి అంశాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, భాను, రత్నం, రాణి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస, మద్దూరు రామయ్య అగ్రహారం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. సర్పంచ్ దాసరి దాలినాయుడు ఆధ్వర్యంలో వీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు తొలగించి, డంపింగ్‌యార్డుకు తరలించారు. గ్రామాల పరిశుభ్రతతోనే ప్రజల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సర్పంచ్ తెలిపారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా పరిసరాల పరిశుభ్రతకు సహకరించి, స్వచ్ఛగ్రామం కోసం పాటుపడాలన్నారు.

సీపీఐ నూతన కార్యవర్గం ఎన్నిక

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని కళావేదిక వద్ద సీపీఐ నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. కార్యదర్శిగా ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, సహాయ కార్యదర్శిగా కనకరాజు, సభ్యులుగా గంగారం, కృష్ణ, అప్పారావు, దుర్గారావు, సత్యారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ తెలిపారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ ప్రజాసమస్యలు పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

నిస్వార్థ సేవే లక్ష్యంగా పనిచేయాలి



డాక్టర్ తలే రాజేష్‌తో వలంటీర్లు

రాజాం: నిస్వార్థమైన సేవే లక్ష్యంగా పనిచేయాలని వలంటీర్లకు వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా నియమితులైన ఏడుగురు వలంటీర్లు ఆయనను పట్టణంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించి, చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించి, ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, ఎంపీటీసీ బింగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో శివాలయం అభివృద్ధి



సరికొత్తగా రూపుదిద్దుకుంటున్న శివాలయం

రామభద్రపురం: స్థానిక పురాతన శివాలయం అభివృద్ధికి గ్రామపెద్దలు శ్రీకారం చుట్టారు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ ఆలయం అభివృద్ధికి నోచుకోకపోవడంతో గ్రామస్తులంతా ఒక్కటై, చొరవ తీసుకుని మరీ అభివృద్ధి చర్యలు చేపడుతున్నారు. గ్రామ ప్రజలు, దాతల సహకారంతో సేకరించిన రూ.20 లక్షలతో ఆలయం లోపల ప్రహరీ నిర్మాణంతో పాటు గాలిగోపురం పనులు పూర్తి చేస్తున్నారు. మరికొద్దిరోజుల్లో వృల్లి వారి కుటుంబం సహకారంతో గతంలో కూలిపోయిన ధ్వజస్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ప్రహరీపై వివిధ రకాల దేవుళ్ల చిత్రాలు గీయించి, రంగులు వేస్తున్నారు. ఆలయానికి సంబంధించి, మరికొన్ని పనులు పూర్తి కావాల్సి ఉండగా, దాతలు సహకరించాలని గ్రామపెద్దలు కోరుతున్నారు.

టీఎల్‌ఎం వినియోగిస్తూ బోధించాలి



పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యాబోధనలో ఉపాధ్యాయులు తప్పనిసరిగా టీఎల్‌ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) వినియోగించాలని ఎంఈవో ప్రసాదరావు సూచించారు. మండలంలోని పోరాం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలు, రికార్డులు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, జగనన్న గోరుముద్ద పథకం కింద అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని దీనికోసం టీఎల్‌ఎం, లెస్సన్‌ప్లాన్ వినియోగించాలని తెలిపారు. చదువులో వెనకబడ్డ విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ దొర తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి సూచించారు. మండలంలోని పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని చెప్పారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ హాస్పిటళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. రోగులతో ఓపిగ్గా మాట్లాడుతూ వారికి వైద్యసేవలు అందించాలని చెప్పారు. ఆస్పత్రి మరింత అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ పల్లవి, పి.ఎం.పాలెం సర్పంచ్ కొంచాడ సన్యాసినాయుడు, రామభద్రపురం సర్పంచ్ కర్రి ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



ప్రజలకు చెత్తసేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న నాయకులు

గుర్ల: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కె.వి.సూర్య నారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన చెత్త సేకరణ బుట్టలను మండలంలోని కెల్ల గ్రామం లో మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెత్తను కాలువల్లో, వీధుల్లో పారబోయకుండా బుట్టల్లో వేసి ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజేయాలని గ్రామస్తులకు సూచించారు. క్లాప్ మిత్రలకు పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన చెత్తసేకరణ రిక్షాలను అందజేశారు. వైస్ సర్పంచ్ కొంచాడ ఈశ్వరరావు, నాయకులు కెల్ల వెంకటరమణ, కెల్ల సూర్యనారాయణ, కెల్ల సురేష్, పైడిరాజు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



తాటిపాడులో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని తాటిపాడు గ్రామంలో రాజాం జీఎంఆర్ఐటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ఎన్.దుర్గాప్రసాద్, సిబ్బంది కలిసి 15 ఆవులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు, 45 ఆవులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సీజన్ మారుతున్న కొద్దీ కొత్త కొత్త వ్యాధులకు పశువులు గురయ్యే అవకాశం ఉన్నందున పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ప్రసాద్, సర్పంచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బుర్రకథ కళాకారులు

బొబ్బిలి:

మండలంలోని మెట్టవలస గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. బుర్రకథ రూపంలో కళాకారులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేశారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో పి.రవికుమార్, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా మనమంతా కృషి చేయాలని, చిన్నతనంలోనే వివాహాలు చేసుకోవడం ద్వారా మాతృ, శిశు మరణాలు జరిగే అవకాశం ఉందన్నారు.

రైళ్లలో అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- రైల్వే డీఎస్పీ హెచ్చరిక



ఔట్‌పోస్ట్ సిబ్బందితో మాట్లాడుతున్న రైల్వే డీఎస్పీ మోహనరావు

బొబ్బిలి:

రానున్న ఎన్నికల సందర్భంగా రైళ్ల ద్వారా అక్రమంగా మద్యం, నగదు, మత్తు పదార్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని రైల్వే విశాఖ డీఎస్పీ బి.మోహనరావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక రైల్వే ఔట్‌పోస్టును సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు క్షుణ్ణంగా చేపట్టాలని ఆదేశించారు. లైన్స్ సీఐ కె.వెంకటరావు, వి.రవివర్మ, స్థానిక సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి



రేగిడి: సీఎఫ్‌లతో మాట్లాడుతున్న ఏపీఎం గోవిందరావు

వంగర: మహిళా స్వయం శక్తి సంఘాలకు మంజూరు చేసిన వివిధ రకాల రుణాల రికవరీపై వెలుగు అధికారులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఏరియా కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి, ఏపీఎం మీసాల చక్రపాణిల ఆధ్వర్యంలో సీసీలు, వీవోఏలు సంయుక్తంగా బకాయి రుణాలు వసూలు చేసేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని కింజంగి, మరువాడ, శ్రీహరిపురం, బాగెంపేట, నీలయ్యవలస, మడ్డువలస గ్రామాల్లో సీసీల సమక్షంలో మహిళా సంఘాల సమావేశం మంగళవారం నిర్వహించి, రుణాల చెల్లింపులపై అవగాహన కల్పించారు. స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, బ్యాంకు లింకేజీల ద్వారా తీసుకున్న రుణాలు వసూలు చేయాలని తెలిపారు.

రేగిడి: మహిళా స్వయం శక్తి సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలని ఏపీఎం గోవిందరావు సీఎఫ్‌లకు సూచించారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో సీసీలు, సీఎఫ్‌లతో సమావేశమైన ఆయన గ్రామాల వారీగా డ్వాక్రా సంఘాల వివరాలు, బ్యాంకు రుణాల లావాదేవీలు, లింకేజీలపై ఆరాతీశారు. సకాలంలో రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవడం, మహిళలు సక్రమంగా రుణాలు చెల్లించేలా అవగాహన కల్పించడం వంటివి చేయాలని తెలిపారు.

ప్రజల వద్దకే మెరుగైన వైద్యం



మందుల కిట్ అందజేస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్యాధికారిణి అపర్ణ

రామభద్రపురం: ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని సోంపురం గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించిన ఆమె అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసదుపాయాలను పరిశీలించి, కాసేపు మాట్లాడారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య బృందం ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్లకు జిల్లా ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు కేసులను రిఫర్ చేస్తున్నారు. కార్యక్రమంలో ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

టెస్ట్ పేపర్లు అందజేత



టెస్ట్‌పేపర్లతో పదో తరగతి విద్యార్థులు

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను మంగళవారం వితరణ చేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్, స్పందన సంస్థ ప్రతినిధి కాజా గోపాలరావు సహకారంతో 50 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. విద్యార్థులంతా బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని దాత ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, హెచ్ఎం విశాలాక్షి, సర్పంచ్ పువ్వల మాధవరావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.వి జయగౌరి తదితరులు పాల్గొన్నారు.